## ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి

**ప్రజాపక్షం/మక్తల్:** ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో భగవాన్‌పల్లి గ్రామానికి చెందిన బండిమీది వెంకటేశ్, కె.తిమ్మప్ప అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్‌లో సిమెంట్ లోడుతో భగవాన్‌పల్లి గ్రామానికి బయలుదేరి వెళ్తుండగా మార్గమధ్యంలో చిన్న గోపులాపూర్, పంచలింగాల గ్రామాల మధ్యలో ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ట్రాలీ పల్టీ పడి అందులోని సిమెంట్ బస్తాలు బండిమీది వెంకటేష్ మీద పడగా తనకు తలకు, శరీరానికి బలమైన రక్తగాయాలు అయ్యాయి. కె.తిమ్మప్పకు కూడా బలమైన గాయాలు కాగా స్థానికులు చూసి బండిమీది వెంకటేశ్ కొడుకు మహేష్‌కు తెలపగా, ప్రైవేట్ వాహనంలో వాళ్ల నాన్నను మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్ సూచన మేరకు మెరుగైన చికిత్స గురించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ ఈ నెల 24వ తేదీ నాడు రాత్రి 7.46 గంటలకు మరణించాడు. అలాగే తిమ్మప్ప రాయచూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, బండిమీది వెంకటేష్ భార్య బండిమీది మంగమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తుచేస్తున్నామని మక్తల్ పోలీసులు తెలిపారు.

## బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతం

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/ నారాయణ-పేట్ :** నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిసిసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల అమలు తీరు ఎలా ఉందో మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నా రెడ్డి, నరేందర్, హనుమంతు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నిర్వహణపై రాష్ట్ర స్థాయి శిక్షణ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు, జడ్చర్ల మున్సిపాలిటీ వేదికగా రాష్ట్రాస్థాయి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నాడు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బోయల కుంట విండో కంపోస్టింగ్ యార్డ దగ్గర జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమ ఏర్పాట్లు పూర్తి (సిడిఓ) డి. హేమలత నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ఎరువుగా మార్చే సాంకేతిక ప్రక్రియలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జడ్చర్ల కేంద్రంగా జరిగిన ఈ శిక్షణలో ఈ కింది మున్సిపాలిటీ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, పారిశుద్ధ్య సిబ్బంది జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్ నగర్, దేవరకద్ర, మక్తల్, షాద్ నగర్, కొత్తూరు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ సైట్ కంపోస్టింగ్ , పట్టణ పచ్చదనాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో, క్షేత్రస్థాయి అమలు బృందాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి ఈ శిక్షణ నిర్వహించబడింది. ప్రజలు ప్రతి ఒక్క ఇంటి నుంచి చెత్త వేరు చేసి (తడి పొడి) మున్సిపల్ వాహనాలకు ఇస్తే ఆ చెత్తను కంపోస్ట్ చేసి, మున్సిపల్ పరిధిలోని చెట్లకు, పార్కుల చెట్లకు, వ్యవసాయదారులకు విక్రయించవచ్చని వివరించారు

## హామీలు నిలబెట్టుకుంటున్న సర్పంచ్



**ప్రజాపక్షం/వెల్దండ:** మండల పరిధిలోని రాచూరు గ్రామ సర్పంచ్ గున్నేళ్ల శ్రీనివాస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ గ్రామ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నారు. ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ.10,116 అందిస్తానని ప్రకటించిన ఆయన, ఆ మాటకు కట్టుబడి శనివారం మరో కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. రాచూరు గ్రామానికి చెందిన కొంగళ్ల శ్యామలమ్మ ఐలేన్ దంపతుల రెండవ కుమార్తె వివాహం సందర్భంగా సర్పంచు శ్రీనివాస్ రూ.10,116 ను పెళ్లి కానుకగా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు సురేష్ రెడ్డి, శంకర్, శ్రీను, శ్రీశైలం, మదర్, గంగాధర్, రమేష్, దుబ్బ కృష్ణయ్య, రాస్కె జంగయ్య, గుత్తి ఎల్లయ్య, కొంగళ్ల మల్లయ్య, పాండు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం వెనుక భాగంలో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచు అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ ప్రభుత్వం, పంచాయితీ పాలకవర్గం కట్టుబడి ఉందని తెలిపారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టరును ఆదేశించారు. గ్రామంలోని ప్రతి వీధిలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, ఉపసర్పంచ్ గుడిసె రాంబాబు, ముఖ్య నాయకులు బోరింగ్ శ్రీనివాసులు, ఈదన్న, చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విష్ణువర్ధన్ రావు చిత్రపటానికి నివాళులు

**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్నపల్లి గణేష్ రావు తండ్రి వెన్నపల్లి విష్ణువర్ధన్ రావు దశదినకర్మ కార్యక్రమం ముష్టిపల్లి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు రంగినేని అభిలాష్ రావు పాల్గొని విష్ణువర్ధన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కురువ విజయ్ కుమార్, కొల్లాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వీపనగండ్ల మండలం మాజీ ఎంపీపీ కమలేశ్వర రావు, కొత్తపేట సహకార సంఘం మాజీ అధ్యక్షుడు రాజ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే...
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి జూపల్లి కృష్ణా రావు
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ :** ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి లు అన్నారు. శనివారం ఎంపీ మల్లు రవితో కలిసి మంత్రి జూపల్లి కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించిన ఆ యన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, బడుగుబలహీన వర్గాల కలను నిజం చేయడానికి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి జూపల్లి బోడ బండ తండాలో మంజూరైన 35 ఇళ్లలో 3 ఇళ్లకు, అలాగే ఎల్లూరు గ్రామంలో మంజూరైన 39 ఇళ్లలో 3 ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా రూ. 22,500 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 4.50 లక్షల ఇళ్లను నిర్మాంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రస్తుత బడ్జెట్ లో రూ. 5,500 కోట్లను కేటాయించిందని చెప్పారు. మొదట కొల్లాపూర్ లోని క్యాంపు కార్యాలయంలో అంగన్ వాడీ టీచర్ల కు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతికతతో అంగన్ వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతికతతో అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేయడమే దీని ఉద్దేశమని చెప్పారు. అనంతరం పెంట్లవెల్లి, వీపనగండ్ల , చిన్నంబావి మండలాలకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఆడబిడ్డల పెళ్ళిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో ఐదుగురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఇంటివద్ద ఉండడం వలన కొంత మంది మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ రోడ్డు పైకి రావడం గమనించడుతోందన్నారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలు కావడం, మరి కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పిల్లలు మరియు తల్లిదండ్రులకు జీవితకాల బాధలకు కారణమవుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇచ్చినట్లయితే చట్టప్రకారం కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్యానాయక్, ఎస్ఐ, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల తనిఖీ

**ప్రజాపక్షం/ మాగనూర్ :** మాగనూరు మండల పరిధిలోని పిఎపిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, తూకం, గన్నీ బ్యాగుల లభ్యత, రైతులకు చెల్లింపుల ప్రక్రియను రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎమ్మార్వో పుష్పలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పిఎసిఎస్ అధికారులు ఆంజనేయులు, ఉమర్ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## తూముకుంట ఇసుక రీచ్ పరిశీలన

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలం తుముకుంట గ్రామంలో ఇసుక రీచ్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజు, సాగునీటి శాఖ ఏఈ నాగన్న తాసిల్దార్ అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. ఇసుక తవ్వకాల పరిస్థితులు, నిబంధనల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించారు. నదీ ప్రవాహం పై ప్రభావం, అనుమతుల ప్రకారం తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలను కూడా అధికారులు పరిశీలించారు. అక్రమ తవ్వకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. ఇసుక లభ్యత గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ ఖాజా మైనుద్దీన్, ఆర్ఐ కురుమూర్తి తదితరులు ఉన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజలే ముఖ్యం

ఆర్టీసీని ఆదుకునే బాధ్యత మాదే
గత పాలకులు యూనియన్లు పెట్టొద్దన్నారు
బిఆర్ఎస్ నేతలది మొసలి కన్నీరు
ఎంపి డాక్టర్ మల్లు రవి



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** ప్రజా ప్రభుత్వంలో మాకు ప్రజలే ముఖ్యమని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నమాల స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి మల్లురవి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులను ఆదుకునే బాధ్యత తమదేనని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్ కమిటీ వేయడం జరిగిందని మల్లు రవి తెలిపారు. గత పాలనలో ఆర్టీసీలో సమ్మె చేయకుండా యూనియన్ లను పెట్టొద్దని నియంతలా పాలించిన ఘనత బిఆర్ఎస్ దేనని విమర్శించారు. కెసిఆర్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి నియంత పాలన కొనసాగించాడని మండిపడ్డారు. గతంలో 55 రోజులు సమ్మె చేస్తే 37 మంది కార్మికులు మరణించడం జరిగిందని, అలాంటి వారు నేడు ఆర్టీసీ కార్మికుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మల్లు రవి ఎద్దేవ చేశారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నదని అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రణాళికబద్ధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 100 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేసి ఐదు నుంచి ఇంటర్ వరకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని మల్లు రవి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని చెప్పారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన వ్యక్తీ జీవన్ రెడ్డి అని మల్లు రవి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని జీవన్ రెడ్డి తీరును ఎండగట్టారు. ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. రూ. 1100 కోట్ల నిధులతో కల్వకుర్తి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి తెలిపారు. అనంతరం ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఎంపీ, ఎమ్మెల్యే ను శాలువలతో సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ రత్నమాల, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ శాన్ వాజ్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు భూపతి రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజాపక్షం/నారాయణపేట :** దేశవ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియను జిల్లాలో మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో అదనపు కలెక్టర్లు, ఫణీంద్ర రెడ్డి, శ్రీనుతో కలిసి తాహసీల్దార్లతో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మక్తల్, నారాయణపేట, నియోజకవర్గాలలో ఎన్నికల సంఘం అధికారులు త్వరలో పర్యటించే అవకాశం ఉందని, నెలాఖరులోపు మ్యాపింగ్ ప్రక్రియను జిల్లాలోకి 85 శాతం పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటింటికి వెళ్లి సిటిజన్ షిప్‌ను చెక్ చేయాలన్నారు. మక్తల్ పట్టణంలోని ఒక పోలింగ్ కేంద్రంలో మ్యాపింగ్ కేవలం 16 శాతం ఉండటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. బిఎల్ఓలు, ఏఈఆర్ఓలు సరిగ్గా పని చేయడం లేదని తన దృష్టికి వచ్చిందని, తాహసీల్దార్లు దగ్గరుండి వాళ్లతో పనిచేయించుకోవాలన్నారు. జిల్లాలోని ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా 85 శాతం మ్యాపింగ్ జరగపోవడం ఏమిటని కలెక్టర్ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగైదు రోజుల్లో ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా గుర్తించిన 10, ఇసుక రీచ్‌లలో సాండ్ రీచ్ అసిస్టెంట్ ను నియమించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్, సీపీఓ ఖాఫు వాహన్, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలోని మండలాల తాహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఇంటింటా జనగణన అవగాహన

ప్రజల్లో చైతన్యం పెంచుతున్న సిబ్బంది



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** 2027 జనగణన సర్వే సందర్భంగా గ్రామాల్లో ఇంటింటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన వీపనగండ్లలో తాహసీల్దార్ ఖాజా మైనుద్దీన్ జనగణన సిబ్బందితో కలిసి ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలోని పలు ఇండ్లకు వెళ్లి జనగణనలో ప్రతి కుటుంబం తప్పని సరిగా పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ మాట్లాడుతూ, దేశాభివృద్ధి ప్రణాళికలకు జనగణన ద్వారా సేకరించే సమాచారం ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సరైన విధంగా అందించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ సారి జనగణన ప్రక్రియ డిజిటల్ విధానంలో కూడా నిర్వహించబడుతున్నందున ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అలాగే ఇంటింటా తిరుగుతూ కుటుంబాల వివరాలు నమోదు చేసే సిబ్బందికి సహకరించాలని, ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా నిజమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. జనగణనలో సేకరించే సమాచారం ఆధారంగా ప్రభుత్వం భవిష్యత్తులో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపోందిస్తుందని తెలిపారు.

## సేవలో సమర్థుడు... చిత్రలేఖనంలో సృజనశీలి



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిలోనూ తన హృదయంలోని కళాకారుడిని జీవించి ఉంచుకున్న ఓ అధికారి కథ ఇది. వీపనగండ్ల మండలంలో నాయబ్ తాహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్, తన కర్తవ్య నిబద్ధతతో పాటు చిత్రలేఖనంలోనూ అరుదైన ప్రతిభను కనబరుస్తూ స్థానికులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్ననాటి నుంచే రంగులు, గీతలతో మమేకమైన శివకుమార్, చదువులోనూ ప్రతిభ చూపించి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. అయితే ఉద్యోగంలో చేరిన తరువాత కూడా తన కళాప్రవృత్తిని వదలకుండా, ఖాళీ సమయాలను సృజనాత్మకంగా వినియోగిస్తూ చిత్రలేఖనాన్ని కొనసాగిస్తున్నారు. రోజువారీ పనుల్లో వచ్చే ఒత్తిడిని తగ్గించుకోవడంలో ఈ కళ తనకు మానసిక ప్రశాంతతనిస్తోందని ఆయన చెబుతారు. శివకుమార్ చిత్రాల్లో భావవ్యక్తీకరణ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇప్పటివరకు మహాత్మాగాంధీ, డా.బి.ఆర్.అంబేద్కర్, అబ్దుల్ కలాం, రామనాథ్ కోవింద్,ద్రౌపది ముర్ము వంటి జాతీయ ప్రముఖుల చిత్రాలను అద్భుతంగా ఆవిష్కరించిన శివకుమార్, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చిత్రాన్ని స్వయంగా అందజేసి వారి అభినందనలు కూడా అందుకున్నారు. అయితే ఇటీవల ఆయన రూపోందించిన ఓ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన తల్లి హీరాబెన్ మోదీతో ఆత్మీయంగా ముచ్చటిస్తున్న అరుదైన క్షణాన్ని భావోద్వేగాలతో నిండిన పెయింటింగ్‌గా ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని స్వయంగా ప్రధానమంత్రి కి అందజేయాలని శివకుమార్ ఆశిస్తున్నారు. తన జీవితంలో అది ఒక అపూర్వ క్షణంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన కూడా శివకుమార్ అభిలాషను గౌరవిసూ ప్రధానమంత్రిని కలిసేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మరోవైపు కళను అభివృద్ధి చేసుకుంటూ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న శివకుమార్ వంటి అధికారులు అరుదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ,

## ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



**ప్రజాపక్షం/ కృష్ణ:** కృష్ణ మండలం గూడెబాల్లూరు, ముడుమాల్ గ్రామాలలో పిఎసిఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రంలో మౌలిక సదుపాయాలు తాగునీరు, ధాన్యం నిలువ సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కాంట వేయడంతోనే ఎప్పటికప్పుడు నిల్వ ఉంచకుండా మిల్లులకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్ప గౌడ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**ప్రజాపక్షం/మాగనూర్:** మాగనూర్ మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో శనివారం ఉపాధి హామీ కూలీలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తలకు టోపీ లేదా గుడ్డ కట్టుకోవాలని ప్రతి 30 నిమిషాలకు ఒకసారి మంచినీళ్లు తాగాలని చెప్పారు. వేసవితాపం దృష్ట్యా కూలీల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ , ఉపసర్పంచు, పంచాయితీ కార్యదర్శి , ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## అండర్ 17 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** రేపటి నుండి జడ్చర్ల లో జరిగే అండర్ 17 బాలుర క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మండల విద్యాశాఖ అధికారి మంజుల దేవి శనివారం పర్యవేక్షించారు. బాలురకు వసతి ఏర్పాటు చేసిన స్వామి నారాయణ్ గురుకుల్ పాఠశాలను వారు సందర్శించి అక్కడ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్, క్రీడాకారులకు కావలసిన వసతి సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి వసతుల విషయంలో అడగడం జరిగింది. అనంతరం పాఠశాలలో క్రీడాకారులు ఉంటున్న గదులను పరిశీలించడం జరిగింది. అనంతరం ప్రారంభోత్సవ వేదిక గురించి ఏర్పాట్ల గురించి అతిథుల రాక గురించి చర్చించారు. క్రీడా పోటీలు ఐదు ప్రధాన క్రీడా ప్రాంగణాల్లో జరగనున్నాయి. స్వామి నారాయణ గురుకుల్ క్రికెట్ మైదానం, జడ్చర్ల మినీ స్టేడియం, సమర్థ పాఠశాల, ఎస్సార్ క్రీడా మైదానం మహబూబ్ నగర్, ఎండి సీఏ మైదానం మహబూబ్ నగర్ క్రీడా మైదానాలలో ఉదయం 8 గంల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 3 గంటల నుండి నుంచి 6 గంటల వరకు మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుంది. రేపు జరగబోయే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే అనిరుద్ రెడి హాజరుకానున్నారు. విద్యా శాఖ అధికారి వెంట ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శారద భాయ్, పీడీపీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధూమర్ల నిరంజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోయిన్, మీడియా ఇంచార్జీ ఆనంద్ కుమార్, కృష్ణయ్య, పీడీలు గజానంద్, నాగరాజు, రఘు, విజయ్, సుగుణ, మేరీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

